## కాంగ్రెస్‌కు ఓటేస్తే అపచారం - బాబు



తిరుపతి, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్): కాంగ్రెస్ పార్టీకి ఓటేయడం శ్రీవేంకటే శ్వరస్వామికి అపచారం చేయడమేనని తెలుగుదేశం పార్టీ (టిడిపి) అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఓటర్లను హెచ్చరించారు. తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన మహాకూటమి బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అవినీతి చివరికి తిరుమలకు కూడా వ్యాపించిందన్నారు. 'కాంగ్రెస్ చివరికి తిరుమలను కూడా వదల్లేదు. తిరుపతి కాంగ్రెస్ అభ్యర్థి, టిటిడీ మాజీ ఛైర్మన్ బి.కరుణాకరరెడ్డి కాంగ్రెస్‌కు చెందిన అవినీతి ఉత్పత్తే' అని ఆరోపించారు. 'శ్రీవేంకటేశ్వరస్వామి చాలా శక్తి వంతుడు. భగవంతుడిని అవమానించిన వారిని ఆయన క్షమించడు. అవినీతి కాంగ్రెస్‌కు ఓటేయడం దైవానికి అపచారం చేయడమేనని గమనించండి' అని చంద్రబాబు సెంటిమెంటు మేళవించి ఓటర్లను హెచ్చరించారు. తిరుమల కొండల్ని రెండింటికి పరిమితం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని ఆయన గుర్తు చేశారు. 'ఒక వేళ కాంగ్రెస్ తిరిగి అధికారంలో కొస్తే , తిరుమలను ఇడుపులపాయకు రాజశేఖరరెడ్డి తరలిస్తారు' అని పేర్కొన్నారు. టిడీపి అధికారంలోకి వచ్చినట్టయితే తిరుమలలో జరిగిన అవకతవకలన్నిటిపైనా దర్యాప్తునకు ఆదేశిస్తామన్నారు. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అధికారం కోసం ఏదైనా చేస్తారని, చివరికి మూడు ప్రాంతాల మధ్యా వైరాన్ని కూడా సృష్టిస్తారని హెచ్చరించారు. పీఆర్పీ అధ్యక్షుడు చిరంజీవి గురించి ఆయన మాట్లాడుతూ, అటు పాలకొల్లులోను, ఇటు తిరుపతిలోను చిరంజీవి ఓటమిపాలవుతారన్నారు.

### 18నెలల చిన్నారి ఘనత
## హగ్గీస్ వారి జాతీయ పోటీలో సూపర్ స్టార్ గా విజయం

హైదరాబాద్ , ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్) ః శ్రీహాన్ అనే నగరానికి చెందిన 18నెలల బాలుడు హగ్గీస్‌వారు ఇటీవల నిర్వహించిన జాతీయ పోటీలో స్టార్ గా నెగ్గి అతి చిన్న వయస్సులోనే తన సత్తా చాటాడు. దేశవ్యాప్తంగా ఎన్నో వందల మంది చిన్నారులు పాల్గొన్న ఈ పోటీలో మరో ముగ్గురితో కలిసి శ్రీహాన్ సూపర్ స్టార్ గా నిలిచాడు. మిగతా ముగ్గురిలో ఇద్దరు కవానా మరియు కియాన్ ముంబయి నుండి, ఒకరు మన్నన్ న్యూఢిల్లీ నుండి విజేతగా నిలిచారు. గత సంవత్సరం నిర్వహించిన ఈ పోటీలో దేశమంతటి నుండి వందల వేల సంఖ్యలో చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లల ఫోటోలను పంపించగా అందులో నుండి వంద మందిని ఎన్నుకొని వాటిలో నుండి నలుగురిని విజేతలుగా హగ్గీస్ ఇప్పుడు ప్రకటించింది. ఈ విజేతల ఫోటోలతో హగ్గీస్ ప్యాక్లు మార్కెట్లోకి వెలువడనున్నాయి. ప్రతి చిన్నారిలో ఏదో ఒక నిగూఢమైన శక్తి మరియు ప్రావీణ్యం దాడి ఉంటుందని హగ్గీస్ భావిస్తోంది. ఇంత చిన్న వయస్సులోనే ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ పోటీలో పాల్గొని తమ బాలుడు విజేతగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీహాన్ తల్లి పుణీత టండన్ తెలిపింది.

### నిజామాబాద్ జిల్లాలో రగులుకున్న రాజకీయ కక్షలు
## ఖానాపూర్ ఎంపీటీసీ దారుణ హత్య

నిజామాబాద్ , ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్): నిజామాబాద్ జిల్లాలో రాజకీయ కక్షలు మరోమారు రగులుకున్నాయి. చాలా కాలం కిందట తెలుగుదేశం, కాంగ్రెస్ మధ్య నెలకొన్న గొడవలు, అంతర్గత కుమ్ములాటలకు కొనసాగింపన్నట్లు ఇక్కడి ఖానాపూర్ ఎంపీటీసీ సతీష్‌ను ప్రత్యర్థులు దారుణంగా హతమార్చారు. ఆయన్ని హత్య చేసి మృతదేహాన్ని గ్రామ శివార్లలో పడవేయటంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ హత్యోదంతం జిల్లా రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది. పాతకక్షలే ఈ హత్యకు దారితీసి ఉంటాయని సహజంగానే అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం ఆధారంగా పోలీసులు కొంత మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిందని భావిస్తున్న ఈ హత్యపై ఇటు తెలుగుదేశం, అటు కాంగ్రెస్ పార్టీ స్థానిక నేతల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఇంటర్ బోర్డు ఎదుట విద్యార్థుల ధర్నా

హైదరాబాద్, ఏప్రిల్ 21: వేసవిలో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించింది. ప్రభుత్వం మార్చి 23 నుంచి సెలవులు ప్రకటించినా దాన్ని తుంగలో తొక్కుతూ కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తున్నాయని సమాఖ్య నాయకులు ఆరోపించారు. తరగతులు ఎందుకు నిర్వహిస్తున్నారని కళాశాలలకు వెళ్లి అడిగితే గూండాలతో దాడులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సెలవుల్లో కూడా తరగతులు నిర్వహించి విద్యార్థులపై వత్తిడి పెంచే ప్రయత్నం మానుకోవాలని హితవుపలికారు. ప్రభుత్వం ఈ వ్యవహారంపై నిమ్మకునీరెత్తినట్లు ఉండడం శోచనీయమన్నారు. ఉత్తమ ఫలితాల పేరిట ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యా వ్యాపారాన్ని విస్తృతం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

## చిరంజీవిపై కేసు వాపసుకు కోర్టు అంగీకారం

హైదరాబాద్, ఏప్రిల్ 21: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించారన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవిపై జారీ అయిన అరెస్టు వారెంట్‌ను వెనక్కి తీసుకునేందుకు (రీకాల్ చేసేందుకు) కోర్టు అంగీకరించింది. చిరంజీవి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ కర్నూలు మూడవ పట్టణ పోలీసులు ఆయనతో పాటు మరో ముగ్గురు స్థానికులపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిరుపై అరెస్టు వారెంట్లు కూడా జారీ అయ్యాయి. కాగా దీనిపై చిరంజీవి తరుపున కొంత మంది న్యాయవాదులు వారెంట్లు వాపసు తీసుకోవాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయమూర్తి అనంతరం చిరంజీవిపై జారీ అయిన వారెంట్లను రీకాల్ చేయడానికి అంగీకరించారు. అయితే జులై 10వ తేదీన చిరంజీవి తప్పకుండా కోర్టుకు హాజరు కావాలని, లేకుంటే తిరిగి వారెంట్లు జారీ చేస్తామని కడప జుడిషయల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఎల్.తేజోవతి ఆదేశాలు జారీ చేశారు. దీంతో చిరంజీవికి కొంత సమస్య తగ్గినట్లే అయింది.



మంగళవారంనాడు టిడిపిపై ఫిర్యాదు పత్రాన్ని ఎన్నికల ప్రధాన అధికారి ఐ.వి.సుబ్బారావుకు అందజేస్తున్న ఆర్థికశాఖమంత్రి కె.రోశయ్య, భారీ నీటిపారుదల శాఖమంత్రి పొన్నాల లక్ష్మయ్య.

## గుడిసెల్లేని ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తాం - వైఎస్సార్



కర్నూలు, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్) ః వచ్చే ఐదేళ్ళలోపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పురిగుడిసెలు లేకుండా చేసి గుడిసెలు లేని ఆంధ్రప్రదేశ్ గా చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం కర్నూలు జిల్లా పోసిగిలో ఏర్పాటు చేసిన మలివిడత ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఇప్పటికే ఇందిరమ్మ గృహాలు నిర్మించామని, దేశంలో అగ్రస్థానం సంపాదించినట్టు తెలిపారు. అలాగే రాష్ట్రంలో గుడిసెల స్థానంలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టి, గుడిసెలు కనిపించకుండా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. టిడిపి, టిఆర్ఎస్‌కు సిద్ధాంతాలు లేవని ఆయన ఎద్దేవా చేశారు. రాయలసీమలో ప్రాజెక్టు నిర్మిస్తే అక్రమమని టిఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారని అన్నారు. తెలంగాణా ప్రాంతంలో ప్రాజెక్టులు నిర్మించబోతుంటే నిర్మాణాలను అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. మొదటివిడతతో కాంగ్రెస్ పార్టీకి 110 సీట్లు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని చూసి, తమ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని వైఎస్ ప్రజలను కోరారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజుమాఫీ వంటిపై తదితర ప్రభుత్వ పథకాలపై విశేష స్పందన లభిస్తుందని ఆయన అన్నారు.

## కుటుంబ రాజకీయాలకు స్వస్తిపలికి లోక్ సత్తాకు ఓటు వేయండి - జయప్రకాష్ నారాయణ్



తిరుమల, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్)ః ప్రజలను మభ్యపెట్టి పదవుల అండతో కోట్లు గడిస్తున్న రాజకీయ వ్యాపారస్థులు విలువైన ఓటు కాంగ్రెస్, టిడిపి, పీఆర్పీలు కాకుండా లోక్‌సత్తాకు ఓటు వేసి ప్రజల సత్తా ఎంటో నిరూపించుకోవాలని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు. పలు సందర్భాలలో లోక్‌సత్తా నిర్వహించ తలపెట్టిన మార్పు కోసం, ప్రజాపాలన కోసం ఈఎన్నికల్లో ధర్మయుద్ధం చేస్తున్న లోక్‌సత్తాను గెలిపించాలని ఆయన కోరారు. ఒక లోక్‌సభ అభ్యర్థికి అయ్యే ఖర్చుతో రాష్ట్రమంతటా లోక్‌సత్తా పోటీ చేస్తుందనాన్నరు. అంగబలం, ధనబలం లేకుండా గుండె బలంతో ఎన్నికల్లో ధర్మపోరాటం చేస్తున్న పార్టీ లోక్‌సత్తా అని అన్నారు. రాజకీయమంటే దోపిడి కాదని జనచైతన్యాన్ని బాగుచేయడమేనని ఆయన స్పష్టం చేసారు. ప్రస్తుతం దేశంలో రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలు సాగుతున్నాయని అన్నారు. ఈ కుటుంబ రాజకీయాలకు స్వస్తి పలికి రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి ప్రజలను ఓట్లకోసం మద్యం, ధనం పంపిణీలతో ప్రజలను మభ్యపెట్టి రాజకీయాలను వ్యాపారంగా సాగిస్తున్న పార్టీలను అంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇందిరా మైదానం నుంచి నాలుగుకాళ్ళ మంటపం, గాంధీరోడ్, కృష్ణాపురం తానా, జ్యోతిథియేటర్, వివేకానంద సర్కిల్ పలుప్రాంతాల్లో ఆయన ప్రసంగించి లోక్‌సత్తా నాయకులను గెలిపించాలని కోరారు.

## తిరుపతిలో ఎన్నికలకు సర్వం సిద్ధం - కలెక్టర్

తిరుమల, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్) ః జిల్లాలో జరగనున్న 2లోక్‌సభ, 14అసెంబ్లీ స్థానాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎం. రవిచంద్ర తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు 8వేల ఈవిఎంలు సరఫరా చేసామన్నారు. ఈ ఎన్నికలకు గాను జిల్లాకు 209పోలింగ్ కేంద్రాల్లో కెమెరాలు అమర్చి ఓటింగ్ ప్రక్రియను నమోదు చేస్తామన్నారు. 237పోలింగ్ కేంద్రాల్లో 170మందితో సూక్ష్మపరిశీలకులను నియమించి ఎన్నికలు సజావుగా జరిగేటట్లు చూస్తామన్నారు. ఈ ఎన్నికలకుగాను 147మంది సెంట్రల్ పార్లమెంటరీ సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం పోలింగ్ కేంద్రాలలో 7518మంది పోలీసు సిబ్బందిని నియమించామని ఆయన స్పష్టం చేసారు. ప్రచార ప్రక్రియ 21సాయంత్రం 5గంటలకు ముగుస్తుందని తెలిపారు. 5గంటల తరువాత జిల్లాలోని అన్ని మద్యం షాపులను తెరచి ఉంచినట్లయితే సీజ్ చేస్తామని చెప్పారు. ఈ ఎన్నికలకు గాను సిబ్బందిన తరలించేందుకు 600ఆర్టీసి బస్సులను వాడుతున్నామని పోలింగ్ అయ్యాక ఎక్కడైనా ఫోటో ఐడెంటిటి కార్డు లేకుండా ఇతర ఏదైనా ఐడెంటిటితో ఓటు వేసిన వారి శాతం 25శాతానికి మించితే ఎన్నికల్లో రిపోలింగ్ జరుగుతుందన్నారు.

గురువారం ఉదయం 7గంటల నుంచి ప్రారంభమయ్యే ఎన్నికల ప్రక్రియ సాయంత్రం 6గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రచారానికి అనుమతించండి : వరుణ్ గాంధీ

హైదరాబాద్, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్): రెండు వారాలు పెరోల్‌పై బయటికి వచ్చిన వరుణ్‌గాంధీ ఎన్నికల ప్రచార సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల సంఘం సూచనలను పట్టించుకోకుండా ఫిల్‌భిత్ నామినేషన్ వేసిన వరుణ్ ఇప్పుడు అక్కడ ప్రచారం చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ర్యాలీ నిర్వహించుకోవడానికి అనుమతి కావాలని వరుణ్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. అయితే పోలీసులు ఇంకా వరుణ్ ఎన్నికల ర్యాలీకి అనుమతి ఇచ్చే విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎలాంటి వివాదాసంస్థ వ్యాఖ్యలు చేయనని సుప్రీం కోర్టుకు లిఖితపూర్వక హామీ ఇచ్చి బయటకొచ్చిన వరుణ్ ఆ మాటను ఏ మేరకు నిలబెట్టుకుంటారన్నది వేచి చూడాలి.

## రెండో విడత ప్రచారానికి నేటితో తెరా

హైదరాబాద్ , ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్): మంగళవారంతో రెండో విడత ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. సాయంత్రం 4 గంటల లోపు అన్ని పార్టీలు ప్రచారాన్ని ముగించాల్సి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఐవి సుబ్బారావు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బలగాలను మోహరిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇప్పటి వరకు గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలలో 14 మంది ఐపియస్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. రెండో విడత ఎన్నికలలో సుమారు 2 కోట్ల 66 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు.

## చిత్తూరులో భారీ వర్షం

తిరుమల, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్) ః సోమవారం సాయంత్రం మొదలైన వర్షం చిత్తూరు పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులకు తోడు గాలివాన వర్షం పడింది. ఈ గాలికి చెట్లు నెలకొరిగాయి. ఇంటిగోడ కూలీ ఒకరు మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు. చిత్తూరు పరిధిలో మూడు గంటలు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చిత్తూరు కొంగారెడ్డిపల్లి చెర్మన్ బాలకొన్నత పాఠశాలలో పదవ తరగతి స్పాట్ వాల్యూయేషన్‌కు వేసిన షామియానాలు నేలకూలాయి. విధి నిర్వహణకు వచ్చిన ఒక ఉపాధ్యాయుడు గాయపడ్డారు. పాఠశాల ఆవరణలోనే ఒక భారీ చెట్టు నెలకూలింది. పొలాల్లోని మామిడి చెట్లు రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తానా వద్ద సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఇళ్ళు కూలిపోవడంతో సుమారు 15వేల ఆస్తినష్టం సంభవించింది. ఆ కుటుంభికులు నిరాశ్రయులయ్యారు.

## ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : ఎస్పీ

కర్నూలు, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్) ః కర్నూలు జిల్లాలో ఈనెల 23న జరిగే ఎన్నికలకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నందికొట్కూరులో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎస్పీ విలేఖరులతో మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 800 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్టు ఆయన తెలిపారు. ఇతర జిల్లాల నుంచి బందోబస్తు నిమిత్తం 6,500 మంది పోలీస్ సిబ్బందిని నియమించుకున్నట్లు తెలిపారు. ఇవిగాక కేంద్రం నుండి 1,000 మంది తాయుద బలగాలను రప్పించుకున్నట్లు ఆయన తెలిపారు. 144వ సెక్షన్ జిల్లాలో అమలులో ఉందని తెలిపారు. శాంతిభద్రతలకు విగాతం కలిగించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా పోలీస్ ట్రిట్‌మెంట్‌కు గురికావాల్సి వస్తుందని ఆయన అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 60 లక్షల విలువచేసే అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 15 నాటుతుపాకులు , 300 నాటుబాంబులు, 500 వేటకొడవళ్ళు, 2 లక్షల విలువచేసే జిలిటెన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

## ఓటర్లను ప్రలోభపెడితే క్రిమినల్ కేసులు

తిరుపతి, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్): ఓటర్లను ప్రలోభపెడితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని మదనపల్లె రిటర్నింగ్ అధికారి బి.శివారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ పంపిణీ, నమూనా బ్యాలెట్ పత్రాల తయారీపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మీడియాతో మాట్లాడుతూ, తమకు ఇష్టమొచ్చిన పార్టీకి ప్రజలు ఓట్లు వేసుకోవచ్చని, ఎవరు ప్రలోభపర్చినా లొంగవద్దని ఓటర్లకు సూచించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురాకూడదన్నారు. పోలింగ్ ప్రిసైడింగ్ అధికారి ఓ సెల్‌ఫోన్‌ను తమ వద్ద ఉంచుకోవచ్చని, దానిని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వినియోగించడానికి అనుమతిస్తామని చెప్పారు. మదనపల్లె డివిజన్‌లో 242 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఒక్కొక్క కేంద్రంలో ఆరుగురు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ ఉదయం 8 గంటలకు ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వద్దకు చేరుకోవాలని తెలిపారు. మదనపల్లె తహశీల్దార్లు రామకృష్ణారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఓటు వేసే ముందు ఆలోచించండి - జూ.ఎన్టీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 21(న్యూస్ ట్రాక్): పోలింగ్ జరిగేనాటి ముందు రోజంతా ఆలోచించి, ఎవరికి ఓటేయాలో నిర్ణయిం చుకోవాల్సిందిగా రెండోవిడత పోలింగ్ లో పాల్గొనబోయే ఓటర్లను సినీ నటుడు, టీడీపీ ప్రధాన ప్రచారకుడు జూన్‌యర్ ఎన్టీఆర్ అభ్యర్థిం చారు. 'మనం ఒక చొక్కాను కొనుక్కుంటున్నప్పుడు మంచి చెడ్డలను సరిచూసుకుంటాం. రానున్న అయిదేళ్ళలో మనను పరిపాలించేవారి గురించి నిర్ణయం తీసుకునేపటప్పుడు మనం మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు. రెండోవిడత ఓటర్లను ఉద్దేశించి సుమారు పదిహేను నిమిషాలపాటు ఆయన చేసిన ప్రసంగం అన్ని ప్రాంతీయ టెలివిజన్ ఛానెళ్ళలో ప్రసారమయింది. ఈ ప్రసంగంలో ఆయన కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. కాంగ్రెస్ పాలన అవినీతితోను, పూర్తి అరాచకత్వంతోనూ కూడుకున్నదిగా ఆయన అభివర్ణిస్తూ ప్రజలను ఆ పార్టీ ఓటు బ్యాంకుగా చూస్తుందన్నారు.

ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి వ్యాఖ్యలను జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తావిస్తూ తొలివిడత పోలింగ్ పూర్తయిన వెంటనే, టీడీపీ నాయకత్వంలోని మహాకూటమి ముందంజలో ఉందని గ్రహించి, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టడాన్ని కాంగ్రెస్ ప్రారంభించిం దన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయినట్టయితే ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాల ప్రజలను హైదరాబాద్ లో విదేశీయుల్లా చూస్తారని వారు అంటున్నారన్నారు. '2004లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ అప్పుడే ఈ అంశంపై తమ అభ్యంతరాలను ఎందుకు లేవనెత్తలేదు? 2004లో కమ్యూనిస్టు పార్టీలతో కూడా కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. వారు తెరాసతోను, వామపక్షాలతోను చేతులు కలిపితే అది శృంగారం, అదే మేము చేస్తే వ్యభిచారమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకత్వానికి, దారుణమైన నేరాలు చేసేవారికి మధ్య ఆయన పోలికతెస్తూ 'మహిళలపైన, ముఖ్యంగా బాలికలపైన యాసిడ్ దాడులు చేసేవారందరూ ఆ బాలిక తనను వ్యతిరేకించినందున, ఆమె సుఖంగా బతకరాదని, జీవితాతం బాధపడాలనిదుష్టాలోచన చేస్తారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు కూడా తాము అధికారంలోకి రాకపోతే ప్రజలు బాధపడాలని కోరుకుంటూ ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతాల ప్రాతిపదికన ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారు. ఇది మరొకరు బాధపడితే వచ్చే ఆనందం తప్ప మరేంకాదు' అన్నారు. టీడీపీ పథకాలన్నీ, ప్రధానంగా నగదు బదిలీ పథకం ఎంతో ప్రయోజనకరమైనవని జూనియర్ ఎన్టీఆర్ చెబుతూ ఈ పథకం కింద మంజూరయ్యే డబ్బుతో తమకు కావలసిన ఖర్చును ప్రజలు పెట్టుకోవచ్చన్నారు. ప్రజారాజ్యం పార్టీపైన, రూ.వందకే నిత్యావసర సరుకుల పంపిణీ, మెరుగైన మార్పు తదితర ఆ పార్టీ హామీలపైన ఆయన ధ్వజమెత్తుతూ ఏ రకమైన మార్పు గురించి ప్రజారాజ్యం పార్టీ మాట్లాడుతోందని ప్రశ్నించారు. ' ఒకవేళ తమ పార్టీలోపల రావాల్సిన మార్పు గురించి వారు మాట్లాడుతూండవచ్చు. ఒక కిలో ఉప్పు, చింతపండు, వంటనూనె, పప్పులు నెలంతా ఒక కుటుంబానికి చాలుతాయా?' అని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా జంధ్యాల చిత్రం 'అహనాపెళ్ళంట'లోని ఒక సన్నివేశాన్ని జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తావిస్తూ ఒక పిసినిగొట్టు (ఆ పాత్రను కోట శ్రీనివాసరావు పోషించారు) బతికున్న కోడిని పైకప్పుకు వేలాడ గట్టి, దాన్ని చూస్తూ, మామూలుగా వండిన ఒట్టి అన్నాన్ని తింటూ చికెన్ బిరియానీని తింటున్నట్టు ఊహించుకుంటాడన్నారు. నిత్యావసర సరుకుల సరఫరా గురించి ప్రజారాజ్యం పార్టీ ఇచ్చిన హామీ తనకు ఆ సన్నివేశాన్ని గుర్తుకు తెస్తోందన్నారు. ప్రజారాజ్యం పార్టీ రాజకీయాల్లో పాకేందుకు సతమతమవుతున్న శిశువుగా ఆయన అభివర్ణించారు. సినిమా టిక్కెట్లను బ్లాక్ లో అమ్ముకున్నట్టు పార్టీ టిక్కెట్లను ప్రజారాజ్యం పార్టీ నాయకత్వం అమ్ముకుందని ఆరోపించారు.